# మిత్రద్రోహం

**నా**కేదో యింత భగవంతుడిచ్చాడు. నేను జైలుకు వెళ్ళిన వాణ్ణి కాకపోయినా నా కొడుకులిద్దరూ ప్రభుత్వోద్యోగాలు చేసుకుంటున్నారు. వెనక దొరల ప్రభుత్వంలో ఎంత శ్రద్ధగా తమపని చేసుకొని పోయినారో ఇప్పుడు మన కాంగ్రెసు వాళ్ళకింద కూడా అంత శ్రద్ధగానూ ఉంటున్నారు. ఇళ్ళ అద్దెలమీద, పొలం మీద నాకేదో ఏటా రెండుమూడు వేలు వస్తుంది. అందుచేత నాకు ఇహ చింత లేదు. నేనేమో నా భగవధ్యానమేమో!

అందుచేత నాకు సీతారామస్వామి ఎక్కువాలేదు. రఘుపతి తక్కువాలేదు. ఇద్దరూ కావలసినవాళ్ళే. వాళ్ళిద్దరికీ చెడ్డదంటే, మీరు నమ్మరుగానీ నేనెంతో ఖేదించానన్నమాట.

మేము ముగ్గురమూ విడవకుండా తిరిగేవాళ్ళం. అదేం చిత్రమో ప్రపంచం మంచి ఎక్కడవున్నా సహించలేదుగద. మేము ముగ్గురమూ కలిసి తిరిగితేనే మా సహాధ్యాయులు సహించలేక పోయారు. మమ్మల్ని విడగొట్టటానికి ఎన్ని ప్రయత్నాలు చేశారు! రఘుపతితో అనేవాళ్ళు గదా "ఒరే, నీతో కలిసి చదవకపోతే స్వామికి ఇంగ్లీషులోనూ, లెక్కలలోనూ సున్నాయే. అటువంటి వాడితోకన్న మరెవరైనా ఇంకా తెలివిగల వాడితో కలిస్తే యింకా మార్కులు ఎక్కువ వస్తాయిరా!" అనేవాళ్ళు. రఘుపతి తండ్రి తద్దినాలు పెట్టాడనీ, వితంతు వివాహాలు జరిగితే వెళతాడనీ నాతో చెప్పేవాళ్ళు. నేనూ రఘుపతీ రాత్రిపూట స్వామి ఇంట్లో చదువుకుని కిరసనాయిలు ఆదాచేస్తున్నామని కూడా అన్నారనుకోండి.

అయినా మేం చీలిపోలేదు. మాది అంత మంచి స్నేహం. నేను చదువు మానేసినాక కూడా వాళ్ళిద్దరూ బి.ఎ. దాకా కలిసినెట్టారు. వాళ్ళిద్దరూ పాసయితే నేను కూడా బియ్యే పాసయినట్టే సంతోషించాననుకోండి. మాది అటువంటి స్నేహం.

కావటానికి మాలో స్వామి కాస్త ధనికుడే. రఘుపతి కూడా నాకంటె ఇంత కలవాడే. అయితే మాలోమేం అటువంటి పట్టింపులెప్పుడూ కలవాళ్ళంకాం. ఇంతకాలానికి రఘుపతి, స్వామి కలిమి చూచి అసూయ పడుతున్నాడనుకోవడానికి నాకేమాత్రమూ మనస్కరించ లేదు. కాని స్వామిమీద రఘుపతి చేసే దుష్ప్రచారానికి మరే ఆధారం ఉండదనుకోవాలి.

స్వామి దాదాపు రెండులక్షలు చేసుకున్నాడంటే నిజంగా సంతోషించవలసిన వాళ్ళలో

నేనూ రఘుపతి మొదటివాళ్ళం. నేను సంతోషించాను. రఘుపతి మరొకలాగా మాట్లాడ నవసరమేముందీ?

పోనీ స్వామి కూడనిపని ఏమన్నా చేశాడుగనకనా? చేనేత గుడ్డల వ్యాపారం చేసుకున్నాడు. అతను చేసిన పెట్టుబడి పదివేలే అయినా రోజులు కలిసిరావటం వల్ల అంతకు ఏడింతలు లాభించింది. వర్తకమన్న తరవాత లాభాలే ఉంటాయనేమిటి? రఘుపతి కూడా చేనేత గుడ్డల వ్యాపారం చేసినవాడేగా. ఎందుకు నష్టపడ్డాడూ? తనకు నష్టం వచ్చింది గనక లాభం వచ్చినందుకు స్వామిని ఆడిపొయ్యటం ఏం సబబుగావుందీ?

నన్నడిగితే డబ్బుకన్న పాపిష్టిదిలేదు. దరిద్రులే సంఘానికి శత్రువులు. పాకీవాళ్ళు చూడండి, కార్మికులు చూడండి, రైలుకూలీలు చూడండి, వీళ్ళు మనకుతెచ్చే అగచాట్లకు అంతంటూ వుందా? హత్యలూ, దొంగతనాలూ, దోపిడీలు, చేసేది ఎవరు? రఘుపతి యివ్వాళ దరిద్రుల జాబితాలో చేరాడు. అందుచేత అతను ఏమన్నా నాకాశ్చర్యంలేదు. డబ్బు పాపిష్టిది.

ఇద్దరూ ఒకే వ్యాపారం చేస్తే చేశారు. కలిసి చెయ్యకుండా ఎవరి దారిన వాళ్ళు చేసుకుంటే అదెట్లా వుండేదో, రఘుపతి వెళ్ళి స్వామితో ఎందుకు కలవటం? తన గుడ్డలకొట్టేమో, తానేమో అన్నట్టుంటే ఏ పేచీ లేకపొయ్యేదిగా? స్వామికి పెట్టుబడి చాలని మాట నిజమేననుకొందాం. అంత చాలకపోతే ఉన్నదానిమీద రాబడి తోటే తృప్తిపడేవాడో, ఎక్కడైనా తలతాకట్టు పెట్టి తెచ్చుకునేవాడో – రఘుపతికెందుకూ? డబ్బు దగ్గిరనా స్నేహితాలు? తను కూడా స్వామికి పదివేలిచ్చాడు. స్వామి తయారుచేయించే బట్టలు జిల్లా అంతటా తానే అమ్మి లాభాలు తీద్దామని ఆశపడ్డాడు. రఘుపతి యిచ్చిన డబ్బు స్వామి తన వ్యాపారంలో పెట్టుబడి చేసుకున్నాడు. దానివల్ల వ్యాపారం బాగా సాగింది కూడాను. సాగినంతకాలమూ రఘుపతి వ్యాపారం కూడా బాగా సాగింది. స్వామి రఘుపతికి ఒక్కడికే రెండు మూడు లక్షల రూపాయల గుడ్డ అందించాడు. రఘుపతి ఆ డబ్బంతా ఎప్పటికప్పుడు స్వామికి పంపుతూ వచ్చాడనుకోండి. దానివల్ల తన వ్యాపారమే పెంచుకున్నాడు. కాని స్వామికి ఒరగబెట్టిందేముంది. నేతగుడ్డకి ధరలు పడిపోతాయని ముందుగానే తెలుసుకుని స్వామి వ్యాపారం ముగించుకుని దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకున్నాడు. రఘుపతి కా అవకాశం లేకపోయింది. పదివేల రూపాయల గుడ్డ అతని దగ్గిర మిగిలిపోయింది. దానిక్కూడా యిప్పుడు ధర పడిపోయిందనుకోండి. దాని కెవరేం చేస్తారూ?

ఇద్దరూ కలిసి అయిదారేళ్ళు వ్యాపారం చేశారు గదా, ఇప్పుడు తీరా వ్యాపారం అయిపోయినాక తనను ముంచాడని స్వామిని గురించి రఘుపతి ప్రచారం చెయ్యటం

ఏమైనా బాగుందా? అవును స్వామికి వ్యాపారం కలిసివచ్చింది. రాహు మహాదశ ఆరంభం కాగానే అతనికి సిరి ఎత్తుకుంటుందని రాసి పెట్టే ఉంది. "తనతో సమంగా నేనూ పెట్టుబడి చేశాను. తన లాభాలలో నాకు దమ్మిడీ యివ్వలేదు!" అంటాడు రఘుపతి, "రఘుపతి నాచేతికిచ్చిన ప్రతి దమ్మిడీకి లెక్క నా దగ్గిరనే ఉంది. అంతకీ నేను గుడ్డ అందిస్తూనే వచ్చాను" అంటాడు స్వామి.

రఘుపతి యింకా ఆ సందర్భాలు చాలా చెబుతాడనుకోండి. నేతగుడ్డలో ముతకరకం వేలకు వేల సరుకు ఖద్దరు కింద బొంబాయికి స్వామి ఎగుమతి చేశాట్ట, దానిమీద చాలా లాభాలు తిన్నాట్ట. తనకు తెలియకుండా తనమీద పోటీకి చౌకగా మా జిల్లాలోనే యింకా ఇతరులకు స్వామి గుడ్డ అమ్మాట్ట. చేనేత వ్యాపారం మీద లాభాలతో స్వామి యింకా అనేక వ్యాపారాలు చేశాట్ట. స్వామి తన వ్యాపారం మానలేదని, ఇప్పుడు చేనేత గుడ్డ ఎగుమతికి ప్రయత్నాలు సాగిస్తున్నాడని తన బంధువులందరి పేరా వ్యాపారం పంచి ఏవో తంత్రాలన్నీ పన్నుతున్నాడని ఇదంతా తనను మోసగించటానికేనని కూడా రఘుపతి చెబుతున్నాడు. ఈ మాటలన్నిటికీ ఎక్కడికి? ఇందులో వ్యాపారపు కిటుకులెన్ని ఉంటాయో నాబోటివానికేం తెలుస్తుంది?

స్వామి పెద్దమనిషి. అతను రఘుపతి వ్యాపారం చెడిపోయినందుకు చాలా విచారిస్తున్నాడని నేను చెప్పగలను. చేసుకోవటం చేతకాక పనికి మాలిన గుడ్డ యావత్తూ తనదగ్గిర పేరబెట్టుకున్నాడని అంతా అమ్ముకుని వుంటే రఘుపతి నష్టపడేవాడు కాడని ఆపత్సమయంలో అతను తననేమైనా అంటే అంత మాత్రం చేత తను ఏమీ అనుకోబోవటం లేదని, ఇప్పటికైనా అతను జారిపోకుండా నిలబడితే చక్కగా వ్యాపారం మాట చూచుకోవచ్చునని స్వామి నాతో అన్నాడు. స్వామికి గొప్ప గొప్ప వాళ్ళదగ్గిర చాలా పలుకుబడి ఉంది. అతని ఇంటిదగ్గిర రోజూ కవులూ, రాజకీయవేత్తలూ, పండితులూ, ఇతరులు చేరటం నేను కళ్ళారా చూచాను. అతను చేసే దానాలకి అంతే లేదనుకోండి. వెధవది ఏ కమ్యూనిస్టులో స్వామిని అనవలసిన మాటలు రఘుపతే అంటున్నాడంటే అతన్ని గురించి పెద్దమనుషులేమనుకుంటారో నాకు బోధ పడకుండా ఉంది!

ఎన్నయినా చెప్పండి. డబ్బు చాలా పాపిష్టిది. అది యుక్తా యుక్తాలు కూడా తెలియనివ్వదు!

***మొదటి ముద్రణ : ఆంధ్రశిల్పి మాసపత్రిక, మార్చ్ 1948***